నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 23 డిసెంబర్ 2024 | KAMAREDDY






**ప్రకృతి సోయగాలు పరవశింపజేశాయి.** వేకువ జామున మంచు కురిసే వేళలో పల్లె అందాలు ప్రకృతి ప్రేమికులను కనువిందుచేశాయి. పంట పొలాలపై మంచుదుప్పటి కప్పుకోగా.. లేలేత భానుడి కిరణాలతో నీటి బిందువులు ముత్యాలను తలపించాయి. ఈ అద్భుత దృశ్యం రూరల్ మండలంలోని కేశాపూర్ శివారులో ఆవిష్కృతమైంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# బీఆర్ఎస్‌లో చేరికలు

- గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే జాజాల

ఎల్లారెడ్డి రూరల్/ నాగిరెడ్డిపేట, డిసెంబర్ 22: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం ఎల్లారెడ్డిలోని పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా..వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాజా ల మాట్లాడుతూ..రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అరెస్టులు, జైలుకు పంపించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని ఎద్దేవా చేశారు. నియోజక వర్గంలో ఇప్పటివరకు ఎలాంటి కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టిందిలేదన్నారు. ఎల్లారెడ్డిని ఐటీ కారిడార్‌గా మార్చేస్తానన్న ఎమ్మెల్యే, ఇప్పటివరకు ఒక్క ఐటీ కంపెనీని ప్రారంభించింది లేదన్నారు. ఎమ్మెల్యే చేతలకు కాకుండా కేవలం మాటలకే పరిమితమయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ నాగిరెడ్డిపేట మండల అధ్యక్షుడు గుర్నాల కిష్టయ్య ఆధ్వర్యంలో వాడి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 50 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో లింగంపేట మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నాయకులు అరవింద్‌గౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి రూరల్ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

# దశాబ్దాలుగా మాటల్లోనే..

- క్షేత్రస్థాయిలో ప్రతిపాదనలు శూన్యం
- 'జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు'పై సందిగ్ధం
- కేసీఆర్ హయాంలో కనిపించిన హడావుడి
- పట్టించుకోని బీజేపీ, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు
- అసెంబ్లీ సమావేశాల్లోనూ ఊసెత్తని వైనం
- విమానాశ్రయం ఏర్పాటుపై కేంద్రం మౌనం

**నిజామాబాద్ జిల్లాలో** ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకొన్నాయి. కొన్నేండ్లుగా జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు అంశం సాగదీత వ్యవహారంగా మారింది. దశాబ్దకాలం నుంచి ఊరించి, ఊరిస్తుండగా.. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఇప్పటివరకు పట్టించుకున్న దాఖలాలులేవు. గాలి మోటర్ గురించి ఊహాలోకంలో విహరించడం తప్ప క్షేత్రస్థాయిలో ఇసుక రేణువు కదలడంలేదు. పదేండ్లుగా ఎయిర్‌పోర్టు అంశం మరుగున పడుతూనే ఉంది. ఇటీవల పార్లమెంట్‌లో జిల్లా ఎంపీ అర్వింద్ జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు అంశాన్ని లేవనెత్తగా.. ఇప్పటివరకు తమకు ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేయడం గమనార్హం.

–నిజామాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**ఏడాది** క్రితం వరకు కేసీఆర్ హయాంలో జక్రాన్‌పల్లి ఎయిర్ పోర్టుపై ఆశలు సజీవంగా ఉండేవి. ఢిల్లీ పర్యటనలో ప్రతిసారి ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎంపీ, ఎమ్మెల్యేలంతా ఈ అంశాన్ని ప్రస్తావించారు. కేంద్ర పౌర విమానయాన శాఖతో ప్రతిసారి సంప్రదింపులు జరిపేది. కాని ప్పుడు ఈ అంశం వరంగల్ ఎయిర్ పోర్టుకే పరిమితమైంది. కాంగ్రెస్ సర్కారు సైతం వరంగల్‌లోని మామునూరు ఎయిర్ పోర్టుపైనే దృష్టిసారించింది. గడిచిన ఏడాది కాలంలో రేవంత్ రెడ్డి సర్కారు జక్రాన్‌పల్లి ఎయిర్ పోర్టు అంశంపై ఊసెత్తిన దాఖలాలులేవు. 2019 నుంచి రెండుసార్లు బీజేపీకి చెందిన ఎంపీ ధర్మపురి అర్వింద్ బాధ్యత వహిస్తున్నప్పటికీ...ఎయిర్‌పోర్టు అంశంపై ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. ఎయిర్ పోర్టు అంశాన్ని మరుగన పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. వరంగల్ ఎయిర్ పోర్టుపైనే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించగా..కేంద్రం కూడా అందుకు సహకరిస్తోంది.



ఎయిర్‌పోర్టు కోసం సేకరించిన భూమి

## రియల్ వ్యాపారులకే మేలు..

జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు అంశం కేవలం మాటలకే పరిమితమవగా.. ఇప్పటివరకు స్థానికులకు పైసా ప్రయోజనం దక్కలేదు. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మాత్రం భారీగా లాభాలు వచ్చాయి. ఎయిర్ పోర్టు అంశాన్ని బూచీగా చూపి ఇష్టారీతిన వ్యవసాయ భూములను తెగనమ్మేశారు. భూములకు ధరలు పెంచేసి ఇష్టారీతిన చేతులు మార్చారు. సామాన్యులకు లేనిపోని ఆశలు కల్పించి వెంచర్లు చేసి ప్లాట్లు కట్టబెట్టారు. రియల్ వ్యాపారులకు ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా మిగిల్చింది. కానీ రియల్ ఎస్టేట్ బ్రోకర్ల మాటలు విని పెట్టుబడి పెట్టిన వారందరూ తీవ్ర నష్టమే చవి చూడాల్సి వచ్చింది. పెరగని గజం ధరలతో ఇక్కట్లు పడుతున్నారు. తీరా అమ్ముకుందామంటే కొనే వారు కరువయ్యారు. వ్యవసాయ భూములైతే ఇష్టారీతిన ధరలను చేర్చారు. రోడ్డుపై ఎకరా భూమి రూ.కోట్లలో చేరింది. ఎయిర్ పోర్టు ఏర్పాటు అంశాన్ని కారణంగా చూపి డిచ్‌పల్లి నుంచి మొదలు పెడితే ఆర్మూర్ వరకు 44వ నంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా రియల్ వ్యాపారులు చేసిన దందా అనేక రీతుల్లో విస్తరించింది. పెట్టిన ధరకైనా పైసల్ వాపస్ వస్తే బాగుండును అనుకుని మదన పడుతున్నారు.






## కాంగ్రెస్, బీజేపీ పట్టించుకోదా...?

తెలంగాణ అభివృద్ధిపై సంపూర్ణ అవగాహన ఉన్న కేసీఆర్ గతంలో జక్రాన్‌పల్లి ఎయిర్ పోర్టు అభివృద్ధిపై దృష్టి సారించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రభావంతో కొన్ని ఇబ్బందులు తలెత్తినప్పటికీ వాటిని అధిగమించేందుకు తీవ్రంగా కృషి చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై కనీసం పట్టించుకోవడం లేదు. జక్రాన్‌పల్లి వద్ద డొమెస్టిక్ విమాన సర్వీసుల కోసం మినీ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కేసీఆర్ హయాంలో అనేక చర్యలు తీసుకున్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాతో చర్చలు కూడా జరిగాయి. మినీ ఎయిర్‌పోర్టుకు రూ.328కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని ఎయిర్‌పోర్ట్ అథారిటీ తేల్చింది. 510 ఎకరాల భూమి అవసరమని నివేదించింది. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు రూ.348కోట్లు, 740 ఎకరాల భూమి అవసరమని తేల్చింది. జక్రాన్‌పల్లి వద్ద ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉండగా భూసేకరణకు ఎక్కువగా ఖర్చు అవసరమే లేదు. తెలంగాణలో కొత్తగా మొత్తం ఆరు విమానాశ్రయాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లుగా ఊహాగానాలు వినిపించాయి. ఇప్పుడు ఈ ప్రకటనలు కేవలం వరంగల్ ఎయిర్‌పోర్టుకే పరిమితమయ్యాయి. ఆశాజనక పరిస్థితులు ఏర్పడిన జక్రాన్‌పల్లి ఏర్పాటు అంశంపై కాంగ్రెస్, బీజేపీకి చెందిన ఎమ్మెల్యే, ఎంపీల తీరుతో స్తబ్ధత ఏర్పడినట్లైంది.

# ఇది దవాఖానేనా?

- జీజీహెచ్‌లో సమస్యలపై వైద్యారోగ్య శాఖ మంత్రి ఆగ్రహం
- మాతాశిశు ఆరోగ్య కేంద్రం, క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభం



దవాఖాన సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ఖలీల్‌వాడి, డిసెంబర్ 22 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దవాఖాన పరిస్థితిని చూసి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దవాఖాన ముందు భాగం డ్యామేజీ కావడం, అద్దాలు ధ్వంసమై ఉండడంతో ఇది దవాఖానేనా లేక ఇంకేమైనానా అని మండిపడ్డారు. మరమ్మతులు ఎందుకు చేయించలేదని ప్రశ్నించారు. అనంతరం దవాఖానలో ఉన్న పేషెంట్లను పలుకరించి అందుతున్న సేవలపై ఆరా తీశారు. దవాఖానలో వసతులు సరిపడా లేవని, సరైన వైద్యం అందడం లేదని వారు చెప్పడంతో ఆయా విభాగాల అధిపతుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాను వైద్యసేవల హబ్‌గా తీర్చిదిద్దాలని, మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. దవాఖాన ఆవరణలో రూ.38.75 కోట్లతో నిర్మించిన మాతాశిశు ఆరోగ్యకేంద్రం, క్రిటికల్ కేర్ యూనిట్‌ని ప్రారంభించారు. కాన్ఫరెన్స్ హాలులో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి, దవాఖానలో సమస్యలు, అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### ఆందోళనలు వద్దు ప్లీజ్..

రెంజల్, డిసెంబర్ 22: రెంజల్ మండల కేంద్రంలో రూ.1.56 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. డిమాండ్ల పరిష్కారం కోసం 'ఆందోళనలు చేయొద్దు ప్లీజ్' అంటూ మంత్రి దామోదార రాజనర్సింహ ఆశవర్కర్లను కోరారు. రెంజల్ మండల కేంద్రంలో నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించేందుకు వచ్చిన మంత్రిని ఆశవర్కర్లు కలిశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేకనే జాప్యం జరుగుతున్నదని ఆశవర్కర్లను పక్కన నిలుపుకొని, ఫొటోకు ఫోజిచ్చి పంపించారు.

### వసతులు కల్పించాలని వినతి..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అందజేసిన అత్యాధునిక పరికరాలు క్యాథ్‌ల్యాబ్ తదితర పరికరాలను వినియోగంలోకి తేవాలని, మెరుగైన వైద్యసేవలందించాలని ఎంఐఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను వెయ్యి పడకలకు పెంచాలని కోరారు.

## అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 22: పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ఉమ్మడి జిల్లాలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఆదివారం పలు మండలాల్లో అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రెంజల్ మండల కేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి, దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమిత్‌షాను ప్రధాని మోదీ కేంద్ర మంత్రి వర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



రెంజల్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాలమహానాడు నాయకులు




కామారెడ్డిలో నినాదాలు చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

## కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

కామారెడ్డి, డిసెంబర్ 22 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన తెలుపగా.. జిల్లా గెజిటెడ్ ఉద్యోగులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం లింగం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల గ్యారెంటీ ఏమైందని ప్రశ్నించారు. హామీ ఇచ్చి ఏడాది అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామన్నారు.